


మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 83 | పేజీలు : 8 | వెల : రూ.2/- సోమవారం 20 ఏప్రిల్ 2026 వైఎస్సార్ కడప


Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 19:** భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యుత్ భారం తగ్గితే ఆ నిధులను ఇతర కార్యక్రమాలకు వాడవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జలధార–హారతి కార్యక్రమంపై చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ జరిపారు. క్షేత్రస్థాయిలో జలధార–జలహారతి పనులను సిఎంకు అధికారులు వివరించారు. 'జలధార' కు అన్నమయ్య కలెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించారు. జలధార కింద అన్ని ఆలయాల మిగతా2లో...

## నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:**యావత్ తెలంగాణ ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు(సోమవారం) సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు.జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు మిగతా2లో...



## తుది ఒప్పందానికి బహుదూరం

### - అమెరికాతో చర్చలపై ఇరాన్

**టెహ్రాన్,మన జనప్రగతి ఏప్రిల్ 19:** అమెరికా, ఇరాన్ చర్చల్లో కొంత పురోగతి సాధించాయని, అయితే ఒక ఒప్పందానికి రావడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్, ప్రధాన సంధానకర్త మొమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ శనివారం ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్న మిగతా2లో...

## ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

● గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సీఎం రేవంత్‌రెడ్డి ● లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా విజ్ఞప్తి



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రి అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం అసెంబ్లీ, మండలి.. ఏ సభలోనూ అజహరుద్దీన్ సభ్యుడిగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వెంటనే ఆమోదించాలని సీఎం... గవర్నర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆయన మంత్రి పదవిని చేపట్టి ఈ నెలాఖరుకు ఆర్నెల్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నుకోబడాలి లేదంటే నియమించబడాలి. కానీ అజహరుద్దీన్ విషయంలో ఈ రెండూ జరగలేదు. అందువల్లే సీఎం అత్యవసరంగా గవర్నర్‌తో భేటీ అయినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మిగతా2లో...



## వైఫల్యం మీదే.. దిగిపోండి

### ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం

### ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు

**న్యూఢిల్లీ, మన జనప్రగతి ఏప్రిల్ 19:** చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయిన దరిమిలా ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం కొత్త రాజకీయ వివాదానికి దారి తీసింది. అధికారిక జాతీయ ప్రసంగాన్ని ప్రధాని మోదీ పక్షపాత రాజకీయ ప్రసారంగా మార్చివేశారని పలువురు విపక్ష నేతలు ఆరోపించారు. తామేమీ తప్పులు చేయలేదని.. బీజేపీ ప్రభుత్వమే తప్పులు చేసిందన్నారు.

మిగతా2లో...

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు...

18 మంది మృతి, ఆరుగురికి గాయాలు




## నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 19:**తాను క్రమంగా కోలుకుంటున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. సర్జరీ విజయవంతమైందని, తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతోపాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ.. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై మిగతా2లో...

## ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

- మహిళలను వంచించిన కాంగ్రెస్ కూటమి
- ఈ నెల 17 మహిళల చరిత్రలో చీకటి రోజు బిల్లు వీగిపోతే ఇండి కూటమి సంబురాలు
- కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే మండిపాటు






## హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

### - వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:**హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ , పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురుస్తోంది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతోంది.సికింద్రాబాద్ బోయిన్ పల్లి పరిసర ప్రాంతాలలో వడగళ్ల వర్షం కురిసింది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన మిగతా2లో...

## రేవంత్ మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ : హరీష్ రావు



**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:** సిఎం రేవంత్ రెడ్డి పోవాలి.. 4 కోట్ల తెలంగాణ ప్రజలు మాజీ సిఎం కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. రేవంత్ మొనగాడు కాదు..మోసగాడని ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ..క్వింటాలు మీద 7 క్వింటాళ్ల తరుగు పెట్టి గోసపెడుతున్నారని రైతులు అంటున్నారని, వడ్లు కొనడం లేదని..5 కిలోల తరుగు పెడుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో ముడుపులు కట్టడం..కుర్చీ కాపాడుకోవడం రేవంత్ రెడ్డి చేసేదని, రేవంత్ మాటలకు

మిగతా2లో...

## ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి

- ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారు
- కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారు
- బూర్జువా పార్టీలను వదిలి జాగృతిలో చేరండి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతిలో చేరిన బోథ్ మాజీ ఎంఎల్ఏ రాథోడ్ బాపూరావు



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
20 -04-2026

# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

కె.రామకృష్ణారావు కూడా ఇదే విషయాన్ని గవర్నర్ వద్ద ప్రస్తావించారు. ఒకవేళ సీఎం చేసిన విజ్ఞప్తిని గవర్నర్ తోసిపుచ్చితే ఈనెల 30 తర్వాత అజహరుద్దీన్ తన మంత్రి పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. శుక్లాతో భేటీ సందర్భంగా విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించినట్టు సీఎంవో పేర్కొంది. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లోక్ భవన్ ఆధ్వర్యంలో జూన్ 12న ఎల్బీస్టేడియంలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామనే విధంగా విద్యార్థుల నుంచి ప్రమాణపత్రం తీసుకోవాలని గవర్నర్ కోరారు. ఆయన చేసిన సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:** ఈ నెల 17వ తేదీ దేశ మహిళల చరిత్రలో ఒక చీకటి రోజుగా, బ్లాక్ డేగా మిగిలిపోతుందని, ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా అలయన్స్ దేశంలోని మహిళలతో పాటు మొత్తం దక్షిణ భారత దేశాన్ని మోసం చేసిందని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే మండిపడ్డారు. మహిళలు చిరకాలంగా కోరుకుంటున్న 33 శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు, దక్షిణ దేశ రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తీసుకునివచ్చిందని ఆమె ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గుర్తు చేశారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు భవిష్యత్తులో జనగణన తర్వాత అన్యాయం జరగకుండా రక్షణ కల్పించడమే ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. అయితే లోక్‌సభలో ఈ బిల్లులు విఫలమైనప్పుడు కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీల నాయకులు దేశ ప్రయోజనాలను మరిచి, ఆ వైఫల్యాన్ని పండుగలా జరుపుకున్నారని వారి నవ్వులు, హగ్‌లు దేశాన్ని ఉత్తర-దక్షిణిగా విభజించే కుట్రకు నిదర్శనమని కేంద్ర మంత్రి శోభ మండిపడ్డారు. దక్షిణ భారతానికి న్యాయం చేసే ఉద్దేశంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో మాట్లాడుతూ ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని, కేవలం ఒక గంట సమయం ఇస్తే కొత్త బిల్లును తీసుకుని వస్తామని ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్, ఇండీ అలయన్స్ పార్టీలు దాన్ని తిరస్కరించాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ రాజకీయ లాభాల కోసం, భవిష్యత్తులో ప్రాంతీయ విభేదాలను మరింత పెంచేలా వారు వ్యవహరించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పదేళ్లుగా మహిళా సాధికారతకు పెద్ద పీట వేశామని విద్య, స్కాలర్‌షిప్‌లు, బీమా పథకాలతో పాటు ముద్ర లోన్లలో 60 శాతం, ఎంఎస్ఎంఇ సబ్సిడీల్లో 53 శాతం మహిళలకే అందించామని పేర్కొన్నారు. ప్రధానిగా ఎబి వాజపేయి ఉన్నప్పుడు స్వయం సహాయక సంఘాల ఆలోచనను విస్తరించి, ఇప్పుడు 3 కోట్లకు పైగా మహిళలను 'లఖ్ పతి దీదీలు'గా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, మహిళ చేతిలో డబ్బు ఉంటే కుటుంబానికి, దేశానికి మేలు జరుగుతుందని ఆమె అన్నారు. నేటి మహిళలు రక్షణ రంగంలో ఫైటర్ జెట్‌లు నడుపుతూ దేశానికి సేవ చేస్తున్నారని, అయినప్పటికీ రాజకీయాల్లో వారికి సరైన అవకాశాలు రాకుండా కాంగ్రెస్ వంటి పార్టీలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో ముద్ర లోన్లలో 63-64 శాతం మహిళలకే దక్కాయని, ఎంఎస్ఎంఈ సబ్సిడీలు 53 శాతానికి పైగా మహిళలు పొందారని స్పష్టం చేశారు. కర్నాటక కోస్టల్ ప్రాంతంలోని మత్స్యకార మహిళల జీవనశైలిని ఉదాహరణగా చూపుతూ, మహిళల చేతిలో ఆర్థిక శక్తి ఉంటే నిర్ణయాధికారం ఎలా మారుతుందో ఆమె వివరించారు. కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు కాంగ్రెస్‌లో మహిళలకు అవకాశం అంటే అది కేవలం ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీ వంటి ఒకే కుటుంబానికి పరిమితమని విమర్శించారు. దేశంలోని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళలలో సీట్లు పెంచే ప్రతిపాదనను అడ్డుకోవడం ద్వారా ఇండియా కూటమి దక్షిణ భారతాన్ని మోసం చేసిందని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణలో ఎంపీ సీట్లు 17 నుండి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38కి పెరుగుతాయని, ఈ ప్రయోజనాన్ని ఇండీ కూటమి అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకత్వం గురించి మాట్లాడుతూ, ఆ పార్టీలో కేవలం 'ఖాన్దాన్' (వారసత్వ) రాజకీయాలే నడుస్తాయని, జార్కిహోళి కుమార్తెకు టికెట్ ఇవ్వడాన్ని ఆమె ఉదహరించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో తనను తాను 'జాదూగర్' (మాంత్రికుడు) అని సంబోధించుకుంటూ అపరిపక్వంగా ప్రవర్తించారని ఆమె విమర్శించారు. సిఎంపై నిప్పులు చెరిగిన శోభ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై, ప్రజలకు చేసిన అన్యాయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె నిప్పులు చెరిగారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్ల పెంపు, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం వంటి ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. చివరగా తెలంగాణ ముఖ్యమంత్రి కేవలం హైకమాండ్‌ను సంతోషపెట్టడానికే ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, హామీల అమలులో విఫలమై రాష్ట్ర ప్రజలను 'పిక్ పాకెట్' చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎంపీ డికె అరుణ పాల్గొన్నారు.

# ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి

**హైదరాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 19:** ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న బూర్జువా పార్టీలను వదిలేసి కొత్త రాజకీయ శక్తిగా రాబోతున్న జాగృతిలో చేరాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన నాయకులంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారని చెప్పారు. బోథ్ మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్‌కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానని గుర్తు చేసుకున్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని..

ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. రాథోడ్ బాపూరావు ఉద్యోగాన్ని వదులుకుని తెలంగాణ ఉద్యమంలో పని చేశారని చెప్పారు. ఆయన తెలంగాణ జాగృతి నుంచే బిఆర్ఎస్‌లో చేరి రెండు సార్లు ఎంఎల్ఎ అయ్యారని.. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పార్టీకి ఆదరణ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా నుంచి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నాయకులు జాగృతిలో చేరారని అన్నారు. ఆదివాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి జనగణనలో ఆదావాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కాన్స్టిట్యూషన్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జెఎసి జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్పి మాజీ చైర్మన్, మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జెఎసి నాయకులు ఆదివారం జాగృతి కార్యాలయంలో కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చందా లింగయ్య దొర ఈ సందర్భంగా వివరించారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెసా చట్టానికి తూట్లు పొడుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోందని అన్నారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో ఆదివాసీలకు ఉన్న రక్షణలను తొలగిస్తోందని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

(మొదటి పేజీ తరువాయి)

వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని వివిధ ప్రాంతాల్లో వడగండ్ల వాన కురుస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్‌టీయూ , నిజాంపేట్, కేపీహెచ్‌బీకాలనీ, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం అకస్మాత్తుగా వడగళ్ల వాన కురిసింది. వేడి వాతావరణం కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వర్షం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు సంభవిస్తున్నాయని, వచ్చే కొన్ని గంటలు కూడా ఇలాంటి పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతల్, పద్మనగర్‌లో గాలి వాన ధాటికి వేర్లతో సహా భారీ వృక్షం కూలింది. చెట్టు దాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షమే పడింది. కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు స్వాంతన పొందారు.

# రేవంత్ మాటలకు ఎక్కువ..
# చేతలకు తక్కువ : హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ..చేతలకు తక్కువని ఎద్దేవా చేశారు. ఎస్ఎల్ బిసిలో మృతదేహాలను బయటకు తీయని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వమని, రైతుబంధు రూ.15 వేలు, బోనస్ ఇస్తామన్నారని ఇచ్చారా? అని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్ పై రాహుల్ గాంధీ పెదవి మూసుకున్నారని, రుణమాఫీపై మొదటి సంతకం అన్నారని.. దేవుళ్లపై భద్రాద్రి రాములు, యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామి, మెదక్ చర్చిలపై ఒట్టు పెట్టారని మండిపడ్డారు. వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పారని, బ్యాంకుల అకౌంట్లు విలీనం కాకుండా రైతులకు రుణమాఫీలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మి డబ్బులు కట్టి మోసపోయారని, అసెంబ్లీలో రుణమాఫీపై నిలదీస్తే అయిందని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ వచ్చాక 4 రైతుబంధు వచ్చాయని..ఒక్క రైతుబంధే వేశారని.. రెండు విడతల రైతుబంధు ఎగ్గొట్టారని, గత యాసంగికి ఇవ్వలేదని హరీష్ రావు దుయ్యబట్టారు.

# కేసుల భయంతో బానిసలా బతుకాలా..?..

**- సోదరుడు జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు**



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 19:** దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు. అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్‌డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు.

# జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పుష్కరిణిల్లో నీరు నింపాలని, అర్బన్ మండలాల్లో నోడల్ అధికారులుపర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు. నీటి సంరక్షణలో అన్నయ్య జిల్లా మోడల్ ప్రతిచోటా అమలు కావాలని, జలధార-జలహారతిలో ప్రజలను భాగస్వాములు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు.

# నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..

(మొదటి పేజీ తరువాయి)

భారీ ర్యాలీగా కేసీఆర్ సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తారు.

# తుది ఒప్పందానికి బహుదూరం

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పదేపదే విశ్వాస ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటూ శనివారం హొర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి ముందు హొర్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించడానికి నౌకలు రుసుము చెల్లించాలని ఇరాన్ ఒత్తిడి చేసింది. రుసుము చెల్లించే నౌకలకు చెల్లించని వాటి కంటే ప్రాధాన్యత ఉంటుందని ఒక సీనియర్ ఇరాన్ అధికారి సీఎన్ఎన్‌కి తెలిపారు. ఈ చర్య అమెరికాతో చర్చలను క్లిష్టతరం చేసినప్పటికీ హొర్ముజ్ జలసంధిలోని పరిస్థితిని ఘాలిబాఫ్ ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక విజయంగా అభివర్ణించారు. శత్రువును మేము నాశనం చేయలేదు. వారి వద్ద ఇప్పటికీ డబ్బు, ఆయుధాలు ఉన్నాయి. కాని వ్యూహాత్మకంగా మా చేతిలో వారు ఓటమి పాలయ్యారు అని ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. చర్చలు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన విభేదాలు ఇంకా పరిష్కారం కాలేదని, అందువల్ల ఏదైనా పురోగతి సాధించడానికి ఇంకా చాలా సమయం పడుతుందని ఆయన సూచించారు. చర్చల్లో చాలా అంతరాలు ఉన్నాయని, తుది షరతులపై చర్చించే దశకు ఇరు పక్షాలు ఇంకా చేరుకోలేదని ఆయన చెప్పారు. **మా అణు హక్కులను కాదనడానికి ట్రంప్ ఎవరు?** ఇరాన్ అణు హక్కులను నిరాకరించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అదివారం స్పష్టం చేశారు. సమీపిస్తున్న కాల్పుల విరమణ గడువుకు ముందు అమెరికా, ఇరాన్ మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేం అణు హక్కులను వినియోగించుకోకూడదని ట్రంప్ ఆదేశిస్తున్నారు. అది ఏ నేరానికి అనేది చెప్పడం లేదు. ఒక దేశం హక్కులను హరించడానికి ఆయన ఎవరు? అని జెష్కియన్ అన్నట్లు ఐఎస్ఎన్ఏ వార్తా సంస్థ పేర్కొంది.

# వైఫల్యం మీదే.. దిగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించని ఆ పార్టీ అధికారంలోంచి దిగిపోవాలని వారు డిమాండ్ చేశారు. గత 12 ఏండ్లుగా చెప్పుకోదగ్గదేమీ సాధించలేక, నిరాశ నిస్పృహలకు లోనైన మోదీ జాతిని ఉద్దేశించి చేసే అధికారిక ప్రసంగాన్ని బురద జల్లుడు, పచ్చి అబద్ధాలతో నిండిన రాజకీయ ప్రసంగంగా మార్చారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. తృణమూల్ అధినాయకురాలు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) ప్రక్రియ, మహిళా రిజర్వేషన్లపై ప్రధాని ప్రజలను తప్పుదోప పట్టించారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ఆమోదింపచేయడంలో విఫలమైన కారణంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించలేదనే విషయం స్పష్టమైందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. అందువల్ల కేంద్రంలో అధికారంలో కొనసాగే హక్కు ఆ కూటమికి లేదన్నారు. ప్రధాని తన ప్రసంగం ద్వారా అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని సీపీఐ ఎంపీ పీ సంతోష్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆదివారం లేఖ రాశారు. దీనిపై ఈసీఐ వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. దూరదర్శన్, సంసద్ టీవీ వంటి ప్రజా వేదికలపై ఆ ప్రసంగాన్ని ప్రసారం చేయడం ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి పాల్పడడమేనని ఆయన ఆరోపించారు.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

**విరుధునగర్, మన జనప్రగతి ఏప్రిల్ 19:** తమిళనాడులోని విరుధునగర్ జిల్లా కట్టనర్‌పట్టి గ్రామంలో ఆదివారం ఓ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి 18 మంది మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. ఫ్యాక్టరీ లోపల ఫ్యాన్సీ టపాసులకు గొలుసులు అతికించడంలో 30 మంది కార్మికులు నిమగ్నమై ఉన్న సమయంలో ఈ పేలుడు సంభవించినట్లు తెలిసింది. పేలుడు ధాటికి భవనంలో కొంత భాగం కూలిపోయింది. గోవిందపల్లూరుకు చెందిన ముత్తు మాణిక్కం అనే వ్యక్తి ఈ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పేలుడుతో ఆ ప్రాంతంలో భయాందోళన నెలకొన్నది. సహాయక చర్యల కోసం అత్యవసర బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. క్షతగాత్రులను వెంటనే విరుధునగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారని చిరంజీవి చెప్పారు. వైద్యుల సూచన మేరకు సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చునని తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 'మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు' అని చెప్పారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను' అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దామని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దీనికి పవన్ స్పందిస్తూ.. నా ఆరోగ్యం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ.. నేను క్రమంగా కోలుకుంటున్నా అని పేర్కొంటున్నారు. మీ ఆదరణకు కృతజ్ఞుడను అని బదులిచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలని తమ సందేశాల్లో పేర్కొన్నారు.

# పీలేరు పట్టణంలో 'ఆపరేషన్ వజ్రప్రహార్' మెగా దాడులు..

**450 ఇళ్లలో సోదాలు - 1200 మంది, 214 వాహనాల తనిఖీ.**





**పీలేరు మన జనప్రగతి ఏప్రిల్ 19:–**అన్నమయ్య జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా పీలేరు పట్టణ పరిధిలోని శ్రీనాథపురం కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో ఆదివారం వేకువజామున భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు, ఐజీపీ ఏ.కే. రవి కృష్ణ మార్గదర్శకత్వంలో, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సూచనలతో ఈ దాడులు చేపట్టారు. రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ నేతృత్వంలో సుమారు 60 మంది పోలీసులు, ఈగల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.మొత్తం 450 ఇళ్లు, 1200 మంది వ్యక్తులు, 214 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 64 మోటార్ సైకిళ్లు, 5 ఆటోలు, 1 ఇన్నోవా కారుపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. శ్రీనాథపురం కాలనీకి చెందిన నీళ్ల శివశంకర్ వద్ద నుంచి 15 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.కేవలం తనిఖీలతో సరిపెట్టకుండా రౌడీ షీటర్లు, అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసులు హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ 'ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ' చేయించారు."డ్రగ్స్ రహిత సమాజమే మా లక్ష్యం. నిరంతరం నిఘా కొనసాగుతుంది" అని డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ తెలిపారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972, పోలీస్ హెల్ప్‌లైన్ 112 కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.ఈ ఆపరేషన్‌లో పీలేరు సీఐ యుగంధర్, కలికిరి సీఐ అనిల్ కుమార్, కలకడ ఎస్సై రామాంజనేయులు, కె.వి.పల్లె ఎస్సై శివకుమార్, పీలేరు ఎస్సై లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా తిరుపతి సిటీ చాంబర్ ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం

**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 19:–** తిరుపతిలోని టి.టి.డి మహతి ఆడిటోరియం వేదికగా తిరుపతి సిటీ ఛాంబర్ 29వ వార్షికోత్సవం మరియు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 1997లో ఒక చిన్న సంస్థగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ తిరుపతి సిటీ ఛాంబర్, నేడు తన 1250వ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఒక అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషం. ఎటువంటి ప్రభుత్వ లేదా బాహ్య ఆర్థిక సహాయం లేకుండా, కేవలం సభ్యుల అంకితభావంతో మూడున్నర లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చిన ఈ సంస్థ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమని సభలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. ముఖ్యంగా వ్యవస్థాపక అధ్యక్షులు అయూబ్ ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి వై. షణ్ముగం యాదవ్ నాయకత్వాన్ని ప్రముఖులు అభినందిస్తూ భారత రాష్ట్రపతి నుండి పారిశుధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరినీ ఒకే వేదికపై గౌరవించే ఉన్నతమైన సంస్కృతిని వీరు నెలకొల్పారని ప్రశంసించారు. అయూబ్ ఖాన్ నిరంతర శ్రమ, షణ్ముగం యాదవ్ దూరదృష్టి వల్లే 29 ఏళ్ల పాటు సేవా కార్యక్రమాలు అవ్యహతంగా సాగాయని వారు పేర్కొన్నారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ సి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ







సమాజంలో నిజమైన సేవకులను గుర్తించి సత్కరించడం ద్వారా ఈ ఉగాది పండుగకు సిటీ ఛాంబర్ నిండుదనాన్ని తీసుకువచ్చిందని పేర్కొనగా, మాజీ ఎమ్మెల్యేలు ఎ. మోహన్ మరియు గాంధీ ఈ సంస్థ తిరుపతి నగరానికే గర్వకారణమని కొనియాడారు. మాజీ టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ కూడా ఛాంబర్ సభ్యుల సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ దళవాయి చలపతి రావుతో పాటు, 70 ఎకరాల అరణ్యాన్ని సృష్టించిన పర్యావరణ పరిరక్షకుడు దుసర్ల సత్య నారాయణ, తోలుబొమ్మలాటలో జాతీయ అవార్డు గ్రహీత ఎస్. చిదంబరరావులను సభ ఘనంగా సత్కరించింది. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను డాక్టర్ పి. రవిరాజు, కె.ఎస్. నంజుండప్ప, కె. గిరిధర కుమార్ అందుకున్నారు. అలాగే 2026 ఏడాదికి గానూ ఉగాది పురస్కార గ్రహీతలుగా వీర్ల శ్రీరామ్ యాదవ్, జి. భూమినాథన్, డాక్టర్ చందన స్రవంతి పొరి, రజిని, వి. రమేష్ బాబు, లయన్ వడ్డాది నాగిని, మరియు సాయి లక్ష్మిలు గౌరవించబడ్డారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ ప్రొఫెసర్ స్టాన్లీ, డాక్టర్ పి.ఎస్. కరుణానిధి, డాక్టర్ సి. స్వరాజ్య లక్ష్మి, మరియు డైరెక్టర్లు డాక్టర్ పి. గోపాల్, డాక్టర్ అలీషా పర్వీన్ తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించగా, దిక్కి డ్యాన్స్ అకాడమీ వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి.

# రఘునాథ్ రెడ్డి గారి వర్ధంతి ఘన నివాళి... హాజరైన గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 19:–** అర్చన విద్యా సంస్థల అధినేత మదన్ మోహన్ రెడ్డి గారి తండ్రి స్వర్గీయ పాపిరెడ్డి రఘునాథ్ రెడ్డి గారి వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఎంపీపీల సంఘా ఉపాధ్యక్షులు వీరబల్లి మండలం ఎంపీపీ గాలివిటి రాజేంద్రనాథ్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి రఘునాథ్ రెడ్డి క్రమశిక్షణకు, సేవా గుణానికి మారుపేరని కొనియాడారు. వారి ఆశయాలను కొనసాగిస్తూ మదన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో విశేష సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు.రఘునాథ్ రెడ్డి గారి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, విద్యా సంస్థల సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సామాజిక సేవలను, ఆదర్శవంతమైన జీవనశైలిని పలువురు స్మరించుకున్నారు. మదన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులకు రాజేంద్రనాథ్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# లాసెట్ అభ్యర్థులకు మార్గదర్శకం

- కడపలో మోడల్ పరీక్ష ఘన విజయం
- న్యాయవిద్యార్థుల్లో ఉత్సాహం వెల్లివిరిసిన పరీక్షా వాతావరణం
- కడపలో లాసెట్ మోడల్ పరీక్ష ఘన విజయగాథ

**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:–** న్యాయవిద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేలా కడప నగరంలోని బసవ రామ తారకం లా కాలేజీలో ఆదివారం నిర్వహించిన లాసెట్ ప్రవేశ మోడల్ పరీక్ష అత్యంత విజయవంతంగా ముగిసింది. రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి షైక్ మొహమ్మద్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఈ పరీక్షను క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమానికి ఎస్‌బీఆర్‌టీఎం లా కాలేజ్ ప్రిన్సిపాల్ జహీరుద్దీన్, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రాఘవ రెడ్డి, ప్రముఖ న్యాయవాది కె. రామకొండయ్య, మంసూర్ లా




అకాడమీ స్థాపకుడు మంసూర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి మరింత ప్రతిష్టను తీసుకొచ్చారు. అతిథులు ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించి పరీక్షను ప్రారంభించగా, విద్యార్థుల్లో ఉత్సాహం మరియు పోటీ భావం స్పష్టంగా కనిపించింది.ఈ మోడల్ పరీక్షలో విశేష సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పరీక్ష నిర్వహణలో నిర్వాహకులు చూపిన కట్టుదిట్టమైన ఏర్పాట్లు, ప్రశాంత వాతావరణం విద్యార్థులకు మరింత ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. నిజమైన ప్రవేశ పరీక్ష వాతావరణాన్ని అనుభవించేలా చేసిన ఈ ప్రయత్నం విద్యార్థుల నుండి ప్రశంసలు అందుకుంది.ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు లాసెట్ విధానం, ప్రశ్నల స్వభావం, సమయ నిర్వహణపై స్పష్టమైన అవగాహన పెరిగిందని అతిథులు అభిప్రాయపడ్డారు. ఇది వారి భవిష్యత్తు లక్ష్యాలకు బలమైన పునాది వేస్తుందని వారు పేర్కొన్నారు.కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తూ, పాల్గొన్న ప్రతి విద్యార్థికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి మార్గదర్శక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, న్యాయవిద్యార్థుల అభివృద్ధికి కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# గుంటూరులో నారాయణ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిఎం వేమిరెడ్డి



**గుంటూరు మన జనప్రగతి ఏప్రిల్ 19:–** గుంటూరులోని ఇన్నర్ రింగ్ రోడ్డు నందు గల అగర్తవారిపాడు లో నిర్మిస్తున్న నారాయణ స్కూల్ నూతన భవన నిర్మాణ పనులను ఆదివారం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా స్కూల్ బిల్డింగ్ లో నిర్మిస్తున్న తరగతి గదులు, బిల్డింగ్ ఎలివేషన్ తదితర అంశాలపై అక్కడ ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికి నిర్మాణ పనులను పూర్తి చేసి స్కూల్ ను ప్రారంభించాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఏజీఎం, డీజీఎం నారాయణ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా..: బండారి లక్ష్మారెడ్డి

- ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్, ఎలక్ట్రానిక్ ) డైరీ ఆవిష్కరణ

**ఉప్పల్ మన జనప్రగతి ఏప్రిల్ 19:-** జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చునని సూచించారు. ఆదివారం ఉప్పల్ ప్రెస్ క్లబ్( ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా) నూతన సంవత్సర -2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో జరిగింది. ఉప్పల్ ప్రెస్ క్లబ్(పి,ఈ) అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, క్లబ్ ప్రధాన సలహాదారులు కంచుకట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారు. ఉప్పల్ ప్రాంత జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన ప్లాట్ల



విషయాన్ని కూడా అసెంబ్లీలో లేవనెత్తానున్నట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేలా ప్రయత్నం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళు ఇప్పించేలా కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, దుబ్బ నరసింహారెడ్డి, తెలంగాణా హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ ఛైర్పర్సన్ డా: శ్రీవాణి చౌదరి, లీగల్ అడ్వైజర్ హైకోర్టు న్యాయవాది కోండ్రోన్ పల్లి గిరిబాబు,వివిధ పార్టీల నాయకులు తాడూరి శ్రీనివాస్, గంధం నాగేశ్వరరావు, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఆకారపు అరుణ్ పటేల్, నెర్థం భాస్కర్‌గౌడ్, కోల రవికుమార్‌గౌడ్, ఎండి. రఫిక్, కంది శ్రవణ్ కుమార్, జలీల్‌పాషా, గుడి మధుసూదన్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, పిట్టల నరేష్, తెలంగాణ సంపత్, నాగరాజు, చల్ల వీరారెడ్డి, మార్నేని ఫణీంద్ర, గోనె శ్రీకాంత్ ముదిరాజ్, పూజల ప్రభాకర్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు,సకినాల ప్రసాద్, మేకల దయాసాగర్‌రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, సంయుక్త కార్యదర్శి వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీర్తి శ్రీనివాస్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శులు ఆనంద నరసింహారెడ్డి, పంబిళ్ల కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్లు కీర్తి సంతోష్ రాజ్, పయ్యావుల సంతోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సుగవాసి ప్రసాద్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్.పి.ఎఫ్ నాయకులు

**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 19:–**రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్ పి ఎఫ్) నాయకులు, సభ్యులు కలిసి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆర్పిఎఫ్ నాయకులు ప్రసాద్ బాబు గారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రసాద్ బాబు కూడా ఆర్పిఎఫ్ నాయకులు రెడ్డి శేఖర్ రాయల్ గారిని శాలువా కప్పి సన్మానించి, వారి సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజాసేవ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు.భవిష్యత్తులో పరస్పర సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజాసేవే తమ లక్ష్యమని, ఎప్పుడూ ప్రజల కోసం ముందుండి పనిచేస్తామని ఆయన తెలిపారు.



# గొంటి శ్రీనాథ్ యాదవ్ వివాహం ఘనంగా ఆంధ్రతెలంగాణ నుంచి అతిథుల సందడి

**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 19:–** అఖిల భారత యాదవ మహాసంఘం తెలంగాణ శాఖ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, నిత్య అన్నదాన సత్ర ముఖ్య బాధ్యులు గొంటి శ్రీనివాస్ పైల్వాన్ యాదవ్ కుమారుడు గొంటి శ్రీనాథ్ యాదవ్ వివాహ వేడుక ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది.ఈ వేడుకకు అఖిల భారత యాదవ మహాసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిఎల్పి యాదవ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే శ్రీ కాటమరాజు దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ దంపతులు కూడా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఉదయం 10:30 గంటలకు జరిగిన ఈ వివాహ వేడుకకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి సుమారు 400 మంది అతిథులు హాజరై సందడి చేశారు. వధూవరులకు ఆశీస్సులు అందజేస్తూ, వేడుకను మరింత ఉత్సాహభరితంగా మార్చారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ యాదవ నాయకులు నార్సింగి అశోక్ కుమార్ యాదవ్, సురేష్ గౌడ్, పల్నాడు జిల్లా కోటప్పకొండ యాదవ అన్నదాన సత్రం అధ్యక్షులు మరియు అఖిల భారత యాదవ మహాసంఘం జాతీయ సెక్రటరీ జనరల్ మద్దుల వెంకట కోటయ్య యాదవ్, ఆనంద్ యాదవ్, గొంటి రవి యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, నంద్యాల కాంట్రాక్టర్ శ్రీనివాస్ యాదవ్, బోరి గొర్ల గాలయ్య యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.వివాహ వేడుక సాంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడగా, హాజరైన అతిథులు వధూవరుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
20 -04-2026

## రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రొద్దుటూరు తాలూకా కార్యవర్గం నియామకం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 19:-** స్థానిక ప్రొద్దుటూరు రాష్ట్ర ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉదయం రాష్ట్ర అధ్యక్షులు ఇంజా సోమశేఖర రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిఎన్ సాయికుమార్ మరియు ఉపాధ్యక్షులు గరుడాచలం ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం. ఆంధ్రప్రదేశ్, ప్రొద్దుటూరు తాలూకా కార్యవర్గం,అధ్యక్షులుగా కె. సుబ్బరాయుడు ఉపాధ్యక్షులుగా ఎం.బాలగంగాధర్ జనరల్ సెక్రటరీగా బి ఆంజనేయుడు సెక్రటరీగా ,పి.కేశవరెడ్డి, ట్రెజరర్ గా డి.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రాజేశ్వరి,ఎం. నాయబ్ భాషా, ఎస్.ఫణీంద్ర, కె. దస్తగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనది. నూతన కార్యవర్గం నియామక పత్రాన్ని అధ్యక్షుడు ఇంజా సోమశేఖర్ రెడ్డి అందజేస్తూ సభ్యులకి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేయడమైనది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, ఉపాధ్యక్షుడు గరుడాచలం, పాలకవర్గ సభ్యులు నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## భాకరాపేటలో వైభవంగా గ్రామ దేవత గంగమ్మ జాతర



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 19:-**మండల పరిధిలోని భాకరాపేట గ్రామంలో గ్రామ దేవత గంగమ్మ జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, పొంగుబాళ్ళు, యాటలు, కోళ్ళు, నైవేద్యాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాల మధ్య గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కోరుకున్న కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని పూజిస్తామని గ్రామస్థులు తెలిపారు.

## ఘనంగా టిడిపి నేత రఘురాం పుట్టినరోజు వేడుకలు



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 19 :-** తెలుగుదేశం పార్టీకి నాయకులు రఘురాం పుట్టినరోజు వేడుకలు ఆదివారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత జేబీ శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలలో పాల్గొని రఘురాంకు బర్తడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి టిడిపి నాయకులతో పాటు జనసేన బిజెపి నాయకులు స్నేహితులు, సన్నిహితులు బర్తడే వేడుకలలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలలో విజయ్, కాలేషా, లోకి, జేబి మిత్ర మండలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## స్నేహిత అమృత హస్తం సేవాసమితికి సత్కారం

**అనంతపురం మన జనప్రగతి ఏప్రిల్ 19:-** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నేత్ర సేకరణ కేంద్రం వారి ప్రథమ వార్షికోత్సవం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవా సంస్థ లకు ఆత్మీయ అభినందన సమావేశం లో పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్వహిస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సత్కారం జరిగింది. జిల్లా చైర్ పర్సన్ కాపు భారతి చేతుల మీదుగా జ్ఞాపిక అందజేశారు.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృంద సభ్యుడు రామాంజనేయులు జ్ఞాపికను స్వీకరించారు. సేవాసమితి చేపడుతున్న విద్యా, వైద్య, పర్యావరణ మరియు సామాజిక సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు.




## మహిళా బిల్లుపై మోదీ సర్కార్‌వి అన్నీ అబద్ధాలే

- అస్తిత్వం,వెన్నెముక లేని తెలుగు నేల పార్టీలు
- ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి ధ్వజం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 19:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా అబద్ధాలు ఆడుతోందని,లేని బిల్లును ఉందని ప్రచారం చేస్తూ ప్రజలను మోసగిస్తోందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.ఆదివారం పులివెందులలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరును దానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర పార్టీల వైఖరిని ఎండగట్టారు.2023లోనే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును, ఇప్పుడు మళ్లీ కొత్తగా తెరపైకి తెచ్చి డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడం కేవలం ఎన్నికల జిమ్మిక్కు అని ఆయన ఆరోపించారు.ఏపీలోని ప్రధాన పార్టీలైన టీడీపీ,వైసీపీ, జనసేనలు మోదీకి కట్టుబానిసలుగా మారిపోయాయని మండిపడ్డారు.తప్పును తప్పు అని చెప్పే ధైర్యం చంద్రబాబు, జగన్,పవన్ కళ్యాణ్‌లకు లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.గుర్రాన్ని గాడిద అన్నా ఊ మోదీ గుర్రాన్ని గాడిదన్నా గాడిదను గుర్రమన్నా అవునని భజన చేసే స్థితిలో మన పాలకులు ఉన్నారు అంటూ ఎద్దేవా చేశారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే వారి సొంత ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.పొరుగు రాష్ట్రాల్లో ఎన్నికల లబ్ధి కోసమే బీజేపీ ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తోందని,కానీ విజ్ఞానవంతులైన ప్రజలు అన్నీ గమనిస్తున్నారని హెచ్చరించారు.అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ,నిజాలను నిర్భయంగా చెప్పలేని నాయకులకు ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, సికిందర్ మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేఓఆర్‌ఎం కళాశాలలో మాక్ ఈఏపీసెట్ పరీక్షలు విజయవంతం



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:-**కడప నగరంలోని కేఓఆర్ఎం కళాశాలలో బీటెక్ అభ్యర్థుల కోసం మాక్ ఈఏపీసెట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలకు 400 మందికి పైగా విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు ఈఏపీసెట్ పరీక్షను సమర్థవంతంగా ఎలా రాయాలనే విషయంపై విద్యార్థులకు మార్గదర్శకాలు అందించి, ఉపయోగకరమైన సూచనలు మరియు వ్యూహాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీమతి ఎస్. లిఖిత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ప్రిన్సిపాల్ డా. బి. సిద్ధేశ్వరరావు కూడా ప్రసంగిస్తూ పట్టుదల, నిబద్ధతతో చదివితే విజయం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని పరీక్షల నిర్వహణను విజయవంతం చేశారు.

## చంద్రబాబు క్లీన్ ఇమేజ్ ఉన్న దార్శనీకుడు: కొమరా వెంకట నరసయ్య



**ఒంటిమిట్ట మన జనప్రగతి ఏప్రిల్ 19:-** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా రాజంపేట సీనియర్ నాయకుడు, రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఒంటిమిట్టలోని హరిత హోటల్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, భారత రాజకీయాల్లో చంద్రబాబు ఒక క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడని, అభివృద్ధికి ట్రెండ్ సెట్టర్ అని కొనియాడారు. ఆయన అమలు చేసే వాగ్దానాలే చేస్తారని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ప్రశంసించారు. తప్పుడు ఆరోపణలతో వైసీపీ ప్రజల్లో అభాసుపాలైందని విమర్శిస్తూ, రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు మరో పదేళ్లపాటు సుస్థిర పాలన అందించాలని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గండబోయనపల్లిలో మే 10, 11న శ్రీ సత్యమ్మ తల్లి గంగ జాతర వేడుకలు



**వాల్మీకిపురం మన జనప్రగతి ఏప్రిల్ 19:-** వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సత్యమ్మ తల్లి గంగ జాతరను ఈ ఏడాది మే 10, 11 తేదీలలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సిద్ధమవుతోంది.ఈ మేరకు ఆలయ ఆవరణలో కమిటీ అధ్యక్షుడు పులి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతర ఏర్పాట్లు, నిర్వహణపై విస్తృతంగా చర్చించారు.ప్రతి సంవత్సరం పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ గంగ జాతరను ఈసారి చిచ్చిలి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది.ఈ సందర్భంగా పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్యమ్మ తల్లి గంగ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు వచ్చి జాతర విజయవంతం కావడానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే మే 3వ తేదీన జాతర చాటింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జాతర నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన చిచ్చిలి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గ్రామ సంప్రదాయాలకు అనుగుణంగా, భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ, గండబోయనపల్లి ప్రజల సహకారంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు భక్తులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై కాంగ్రెస్ ఆందోళన

- డీలిమిటేషన్‌తో లింక్ చేయడం రాజకీయ యుక్తి
- కాంగ్రెస్ నాయకుడు ఇర్ఫాన్ బాషా



**ప్రొద్దుటూరు మన జనప్రగతి ఏప్రిల్ 19:-** మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం సరైంది కాదని కాంగ్రెస్ నాయకుడు ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లును ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల్లోనే వెంటనే 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల సాధికారతకు ఆలస్యం చేయకుండా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.జనగణన, డీలిమిటేషన్ తర్వాతే అమలు చేస్తామనడం ఆలస్యం చేసే ప్రయత్నమని విమర్శించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణ రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశముందని, జనాభా నియంత్రణ చేసిన రాష్ట్రాలకు నష్టం కలుగుతుందని అన్నారు. ఉత్తర రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యం కలిగే విధంగా మార్పులు రావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం రాజకీయ సమతౌల్యాన్ని కూడా దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు.మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ మద్దతు ఉన్నప్పటికీ, దాన్ని ఇతర అంశాలతో కలపడం తగదని స్పష్టం చేశారు. ప్రత్యేక మెజారిటీ అవసరమైన ఈ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించరాదని సూచించారు. అన్ని పార్టీల సహకారంతో మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర విశేషమని పేర్కొంటూ, ప్రజలు నిజమైన అభివృద్ధి కోసం సరైన నిర్ణయం తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలు సరైన రాజకీయ నిర్ణయం తీసుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు.

## మారుతి హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 19:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కాలేజీ రోడ్డులో ఉన్న మారుతి హాస్పిటల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో హాస్పిటల్ సిబ్బందికి ప్రమాదాల నివారణపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో బ్యాటరీలు,ఇన్వర్టర్లు,ఏసీలు మరియు ఐసీయూ విభాగాల్లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు భయాందోళన (పానిక్ ) చెందకుండా సురక్షితంగా బయటపడటం ఎలాగో ప్రయోగాత్మకగా వివరించారు.అత్యవసర సమయంలో హాస్పిటల్‌లోని ఫైర్ ఎస్టింగిషర్లను ఏ విధంగా ఆపరేట్ చేయాలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి చూపిస్తూ శిక్షణ ఇచ్చారు.ప్రతి ఒక్కరూ అగ్నిమాపక పరికరాల వాడకంపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి,హాస్పిటల్ సిబ్బంది మరియు అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.షార్ట్ సర్క్యూట్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిప్రమాదం జరిగినప్పుడు నిశ్చలంగా ఉండి ఎగ్జిట్ మార్గాల ద్వారా బయటకు వెళ్లాలని,అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలియజేశారు.

## రియల్ సంస్థ పిలుపు..అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలకు నో




**కాణిపాకం మన జనప్రగతి ఏప్రిల్ 19:-**చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా రూరల్ ఎడ్యుకేషన్ అండ్ లిబర్టీ (రియల్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కాణిపాకంలో విజిలెన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని బాల్య వివాహాలను అరికట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో బాల్య వివాహాల నివారణ అధికారులు (సి.ఎం.పీ.ఓలు), ఆశా వర్కర్లు పాల్గొని జిల్లా వ్యాప్తంగా ఈ అనాచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు తమ కట్టుబాటును వ్యక్తం చేశారు. రియల్ సంస్థ జిల్లా యంత్రాంగం, పంచాయతీలు, పాఠశాలలు, మత పెద్దలతో సమన్వయం చేసుకుని గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వేలాది మందితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.రియల్ సంస్థ డైరెక్టర్ ఎస్. రామారావు మాట్లాడుతూ బాల్య వివాహం శిక్షార్హ నేరమని స్పష్టం చేశారు. అక్షయ తృతీయ వంటి పవిత్ర సందర్భాలను ముసుగుగా చేసుకుని జరిగే వివాహాలను సహించబోమని హెచ్చరించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం2006 ప్రకారం నేరస్తులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.అధికారుల ప్రకారం అవగాహన కార్యక్రమాల ప్రభావంతో ప్రజల్లో చైతన్యం పెరిగి బాల్య వివాహాల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల నమోదవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సమాచారం అందిస్తూ అధికారులకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. 2030 నాటికి చిత్తూరు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.అలాగే జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ 250కి పైగా భాగస్వాములతో కలిసి దేశవ్యాప్తంగా 450కి పైగా జిల్లాల్లో ప్రచారం నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఐదు లక్షలకు పైగా బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.కార్యక్రమంలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రియల్ సంస్థ కోఆర్డినేటర్ అనిషా, ఐసిడిఎస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
20 -04-2026

# చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ విస్తరణపై డిమాండ్

**చేనేత గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి**

**అనుబంధ కార్మికులకూ పథకం వర్తింపజేయాలని అవ్వారు విజ్ఞప్తి**



**సిద్దవటం మన జనప్రగతి ఏప్రిల్ 19:-** చేనేత మగ్గం పనులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలతో పాటు చేనేత అనుబంధ పనులు చేసే కార్మికులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ ప్రభుత్వాన్ని కోరారు.ఆదివారం సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.మగ్గం పనులతో పాటు అమ్ములు అతకడం, వార్పులు చుట్టడం, పడుగులు తయారు చేయడం, బాబిన్లు చుట్టడం, రంగులు అద్దడం వంటి అనుబంధ పనులు చేసే కార్మికులు కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీరి కష్టాలను ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు.చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, ఇదే ప్రయోజనం అనుబంధ కార్మికులకు కూడా అందాలని చేనేత జౌళి శాఖ మరియు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలువురు చేనేత అనుబంధ కార్మికులు పాల్గొని, చేనేత గుర్తింపు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వబోమని హెచ్చరించారు.

# కలెక్టరేట్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**● ఆన్‌లైన్‌లో కూడా అర్జీల స్వీకరణ ● కాల్ సెంటర్ 1100 ద్వారా సమాచారం**




**మదనపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 19:-** ప్రజల సమస్యలను స్వీకరించి వాటికి త్వరితగతిన పరిష్కారం అందించేందుకు ఈ నెల 20న సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కేంద్రం మదనపల్లితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో కూడా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.అర్జీదారులు తమ ఫిర్యాదులను జిల్లా కలెక్టరేట్‌కు వచ్చాల్సిన అవసరం లేకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు చేసిన అర్జీల స్థితి గురించి తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.అలాగే, ప్రజలు ముందుగా తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులకు సమర్పించాలని సూచించారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలతో ఉన్నవారే జిల్లా కేంద్రంలో జరిగే వేదికకు హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు.

# విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలి




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:-**రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు 2026 ఏప్రిల్ నుంచి అమలులోకి రావాల్సిన పీఆర్సీ పై ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని ఓ అండ్ ఎం కార్మిక సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి, ఓ అండ్ ఎం కార్మికులకు ప్రత్యేక పీఆర్సీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఆదివారం నగరంలోని ఓ కళ్యాణ మండపంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నప్పటికీ తగిన సిబ్బంది నియామకాలు జరగడం లేదని పేర్కొన్నారు. పగలురాత్రి తేడా లేకుండా పనిచేస్తూ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికీ, తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఓ అండ్ ఎం కార్మికుల అజెండాను ప్రతిబింబించే గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దవనం దొరబాబు, డిస్కం సెక్రటరీ బి. మురళీమోహన్, డిస్కం ప్రెసిడెంట్ డి. మౌలాలి, రీజినల్ సెక్రటరీ జి. చంద్ర ఓబుల రెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ ప్రేమ్‌చంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. దస్తగిరి, డివిజనల్ సెక్రటరీ శ్రీహరి ప్రసాద్, డివిజనల్ ప్రెసిడెంట్ గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంలో ఓడిపోయిన ప్రధాని రాజీనామా చేయాలి



**కర్నూలు ఆలూరు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 19:-** పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంలో ఓడిపోయిన ప్రధాని మోదీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆలూరు యోజకవర్గ పర్యటనలో భాగంగా మండల అధ్యక్షులు పూలు రామాంజనేయులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకొని డిలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాలి అని చూశారని, రాహుల్ గాంధీ ఎంతో చాకచక్యంగా బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవడం చారిత్రక ఘట్టం అని అన్నారు. మన రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంది అని తెలిసి కూడా టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ పార్టీలు మద్దతు తెలపడం విచారకరం అని అన్నారు. జనగణన, కులగణన చేసి మహిళా రిజర్వేషన్ మరియు డెలిమిటేషన్ బిల్లు చేయాలి అని, జనాభా తో పాటు జీఎస్డీపీ ను కూడా పరిగణలోకి తీసుకోవాలి అన్నారు. కర్నూలు జిల్లా ప్రాజెక్టుల ఊసే లేకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం కు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరుపున అల్టిమేటం జారీ చేస్తున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా ప్రాజెక్టులు అయినా వేదవతి, గుండ్రేవుల వెంటనే మొదలు పెట్టకపోతే ఆమరణ దీక్ష చేపడతాం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ విజ్ఞతతో ఆలోచించి కర్నూలు జిల్లా గురించి ఆలోచన చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బోయ లక్ష్మన్న, ఖాదర్ భాష, వెంకట్ జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

# మైదుకూరు ట్రాన్స్‌కో డీఈపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం డిమాండ్



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:-** కడప జిల్లా మైదుకూరు విద్యుత్ సబ్‌డివిజన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీకాంత్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కామునూరు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కడప నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మైదుకూరు సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది పట్ల డీఈ జె. శ్రీకాంత్ అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని తీవ్రంగా ఖండించారు. ఇటీవల ఒక అధికారిని కార్యాలయానికి పిలిచి, "సస్పెండ్ చేస్తా, ప్రమోషన్ రాకుండా అడ్డుకుంటా, నీ చేత అయినది చేసుకో" అంటూ వినియోగదారుల సమక్షంలో బెదిరించడం అనుచితమని పేర్కొన్నారు.ఇప్పటికే ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, పత్రికల్లో కూడా పలు వార్తలు వచ్చినట్లు తెలిపారు. వారం క్రితం కాజీపేట, దువ్వూరు సెక్షన్ అధికారులు, ఓఎన్ఎమ్ సిబ్బందిపై కూడా ఇదే విధంగా అసభ్యంగా ప్రవర్తించినట్లు చెప్పారు. దీనికి నిరసనగా కార్మికులు ఆందోళనలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు వ్యక్తం చేసిన కార్మికులు, ఉద్యోగులను బెదిరించడం, పిటిషన్లు పెట్టించడం, జీతాలు కోత విధించడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అధికారిపై దాదాపు 150 మంది కార్మికులు ధర్నా నిర్వహించడం కూడా ఆయన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.అధికార యంత్రాంగాన్ని, రాజకీయ నాయకులను తప్పుదారి పట్టిస్తూ తనపై వస్తున్న విమర్శలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంచార జాతుల అభివృద్ధికి కేంద్రం చర్యలు

**● డిఎన్టి కులాలను ప్రధాన స్రవంతిలోకి తేవడమే లక్ష్యం: దొమ్మర శ్రీనివాసులు**




**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 19:-** సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని, డీనోటిఫైడ్ ట్రైబ్స్ (డిఎన్టి) కులాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని కడప జిల్లా బీజేపీ ఓబీసీ విభాగ ఉపాధ్యక్షుడు దొమ్మర శ్రీనివాసులు తెలిపారు.ఆదివారం చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ..విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శనివారం డిఎన్టి 32 కులాల ప్రతినిధులతో కేంద్ర డిఎన్టి బోర్డు సభ్యులు ప్రవీణ్ గూడే, భరత్ భాయ్ సమావేశమైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంచార జాతుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు చెప్పారు.బ్రిటిష్ కాలంలో ఏర్పడిన నేరపూరిత ముద్రను తొలగించి, సంచార జాతులను సమాజంలో గౌరవప్రదమైన స్థాయికి తీసుకురావడానికి కేంద్రం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో డిఎన్టి కులాల ప్రస్తుత పరిస్థితిని కూడా సభ్యులకు వివరించినట్లు తెలిపారు.రాష్ట్రంలో డిఎన్టి 32 కులాలకు కుల సర్టిఫికెట్ల జారీ ఆలస్యంగా జరుగుతుండటంపై సమావేశంలో ఆందోళన వ్యక్తమైందన్నారు.జిల్లా కలెక్టర్ల ద్వారా సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.ఇదాతే కమిషన్ సూచనల మేరకు డిఎన్టి కులాలకు సీడ్ పథకం కింద సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, బ్యాంకు లోన్లు అందించాలని కోరినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపి శ్రీనివాసులు, డిఎన్టి రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, నాయకులు వెంకట్ సి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి అవసరం: కృష్మ అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:** ప్రైవేట్ పాఠశాలలు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ విద్యా ప్రమాణాలను నిలబెట్టేందుకు కృషి చేస్తున్నప్పటికీ, ప్రస్తుతం సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయని కృష్మ అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి తెలిపారు. ఈ పరిస్థితుల్లో యాజమాన్యాలు ఐక్యంగా ముందుకు సాగి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.రాయచోటి రోడ్డులోని ఎస్వీ కన్వెన్షన్ హాలులో జరిగిన కృష్మ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల ఒత్తిళ్లు, మారుతున్న నిబంధనలు, అనవసర తనిఖీలు, స్కూల్ రీన్యువల్స్ సమస్యల వల్ల ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ఆర్‌టీఈ 12(1)(సి) కింద ఉచిత విద్య అందిస్తున్నప్పటికీ ప్రభుత్వ బకాయిలు పూర్తిగా చెల్లించలేదని విమర్శించారు. ఈ బకాయిల వల్ల పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. పూర్తి బకాయిల కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.కార్పొరేట్ పాఠశాలల పెరుగుదలతో చిన్న పాఠశాలలు నష్టపోతున్నాయని, జీవో 42 వల్ల కూడా ఇబ్బందులు పెరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తగిన సహకారం అందించాలని కోరారు. తల్లిదండ్రుల నమ్మకమే తమ బలం అన్నారు.**కమిటీ ఎన్నిక..** కృష్మ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని అధ్యక్షుడిగా లెక్కల జోగిరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సి.ఎస్. రామాంజనేయరెడ్డి, ఖజానాదారుగా సుబ్రమణ్యం సహా 25 మంది సభ్యులను ఎంపిక చేశారు. కృష్మ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# గాలివీడు రోడ్డులో గీతా సర్కస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి





**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 19:-** రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గీతా సర్కస్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా,యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు.ప్రారంభోత్సవం అనంతరం మంత్రి సర్కస్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇటువంటి వినోదాత్మక కార్యక్రమాలు ప్రజలకు ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని తెలిపారు. ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమాలను ఆస్వాదించాలని సూచించారు.కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ వినోద రంగం అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులు,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 19:-**ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏప్రిల్ 20వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు అదనపు కమిషనర్ శారదా దేవి తెలియజేశారు.గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

# ముఖ్యమంత్రి జన్మదినోత్సవ కార్యక్రమములకు నాయకులకు కార్యకర్తలకు ఆహ్వానం - ఎమ్మెల్యే




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 19:-** సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గం నందు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి,నాయకులు నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు.ఉదయం 7 గంటలకు అన్నా క్యాంటీన్ నందు వేయి మందికి అల్పాహారం ఏర్పాటు చేసినఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి. ఉదయం 8.30 నిమిషాలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద 76 కేజీల భారీ కేకు కట్ చేయడం జరుగుతుందని, శివాలయం సెంటర్ నందు ఉన్న కూరగాయల మార్కెట్ నిర్మాణం ఆగిపోయినందున సోమవారం ఉదయం 9.30 నిమిషాలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని పునఃప్రారంభం చేయడం జరుగుతుందని, కావున ఈ కార్యక్రమాలలో కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు,నందమూరి అభిమానులు అందరూ తప్పకుండా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నామని తెదేపా కార్యాలయ వర్గాలు తెలియజేశాయి.

# కళ్యాణదుర్గంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 19:-**స్వర్గీయ ఉన్నం హనుమంతరాయ చౌదరి గారి సంస్మరణ సభ సందర్భంగా కళ్యాణదుర్గానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు.ఆయన క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మంత్రిని జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ ఆధ్వర్యంలో ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని మంత్రికి స్వాగతం తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

# వై వి బి రాజేంద్రప్రసాద్ కు అభినందనలు తెలిపిన 'సింగంశెట్టి '



**తిరుపతి, మన జనప్రగతి ఏప్రిల్ 19:-** తెలుగుదేశం పార్టీ జాతీయఎ ఉపాధ్యక్షులుగా నియమితులైన వై వి బి రాజేంద్రప్రసాద్ కు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య కలసి అభినందనలు తెలిపారు. ఆదివారం విజయవాడలో రాజేంద్రప్రసాద్ ను సింగంశెట్టి సుబ్బరామయ్య కలసి శాలువ తో సత్కరించి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. రాబోయే రోజులలో వైవిపి రాజేంద్రప్రసాద్ మరెన్నో పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి.. తెలుగు దినపత్రిక
20 -04-2026


## ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 19:-** అగ్నిప్రమాదాల నివారణలోప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యమైనదని వేంపల్లె ఫైర్ అధికారి శివరామిరెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంపల్లెలోని ఆసుపత్రుల్లో ఫైర్ స్టేషన్ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించు కోవాలని కోరారు. ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది కూడ అప్రమత్తంతో ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాలు ఆకస్మితుగా జరుగుతాయని వాటిని నుండి బయట పడేందుకు ధైర్యంగా సహసించాలని కోరారు. అగ్ని ప్రమాదాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉద్యోగులకు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించాలని ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజి, రసాయన పదార్థాల నిర్వహణలో తీసుకో వలసిన జాగ్రత్తలపై తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 101 అగ్నిమాపక సేవల నంబరుకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి..!

### - రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 19:-**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.


## జనగణన పూర్తి చేయాలి: వెలుగు సిసి కొమ్ము శేఖర్



**డోన్ మన జనప్రగతి ఏప్రిల్ 19:-** డోన్ మండలం పరిధిలోని కొచెర్వు గ్రామంలో జనగణన స్వీయ నమోదు పై భారీ అవగాహన ర్యాలీపొదుపు మహిళలతో విస్తృత ప్రచారం ప్రతి కుటుంబం నమోదు కావాలని అధికారుల పిలుపు,డోన్ మండలం పరిధిలోని కొచెర్వు గ్రామంలో జనగణన స్వీయ నమోదు (సెల్ఫ్ ఏనుమేరేషన్ ) ప్రక్రియపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని వెలుగు సిసి శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పొదుపు మహిళల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ ర్యాలీ సందర్భంగా మహిళలు ప్రజలకు జనగణన యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి కుటుంబం తప్పనిసరిగా స్వీయ నమోదు ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వీయ నమోదు ద్వారా ప్రభుత్వానికి ఖచ్చితమైన గణాంకాలు అందుతాయని, వాటి ఆధారంగా అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు చేయబడతాయని వివరించారు.కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రంగస్వామి మాట్లాడుతూ, "ప్రతి కుటుంబం తమ వివరాలను సరిగ్గా నమోదు చేయడం ద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి" అని సూచించారు. వెలుగు సీసీ శేఖర్ జనగణనలో పొదుపు మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. వీవోఏ పరిమళ, అనురాధలు మహిళలకు స్వీయ నమోదు విధానాన్ని సులభంగా అర్థమయ్యేలా వివరించారు.గ్రామంలోని పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన దున్నూతల ఎల్లారెడ్డి

**● పదవీ విరమణ సన్మాన సభలో వక్తల ప్రశంసలు**



**బద్వేలు మన జనప్రగతి ఏప్రిల్ 19 :-**42 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందించి విద్యారంగానికి వన్నె తెచ్చిన వ్యక్తి దున్నూతల ఎల్లారెడ్డి అని బద్వేలు, గోపవరం మండల విద్యాశాఖ అధికారులు ఎస్. మల్లిక, ఎన్. చెన్నయ్యలు పేర్కొన్నారు.ఆదివారం బద్వేలు పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దున్నూతల ఎల్లారెడ్డి పదవీ విరమణ సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాదన విజయకుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా పాల్గొన్న విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి వృత్తి పట్ల అంకితభావం, సమయపాలన, క్రమశిక్షణతో ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారని కొనియాడారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాలల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. తాను పనిచేసిన ప్రతి పాఠశాలలో అభివృద్ధికి కృషి చేసి విద్యా ప్రమాణాలను పెంచడంలో కీలక పాత్ర పోషించారని వివరించారు.ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీయూ జిల్లా నాయకుడు ఎన్. వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్ నాయకులు పాలా శ్రీనివాసులరెడ్డి, ఆపస్ నాయకుడు నంద కిషోర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి పదవీ విరమణ ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. మృదుస్వభావి, స్నేహశీలి అయిన ఆయన అజాతశత్రువుగా నిలిచారని తెలిపారు.లక్ష్మీపాలెం, రాజుపాలెం ప్రాంతాల్లో పాఠశాలలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన చేసిన కృషి విశేషమని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్. ఓబుల్ రెడ్డి, పిఆర్టియూ మాజీ గౌరవ అధ్యక్షుడు పి. గోపాల్ రెడ్డి, టి. శ్రీనివాసులు, బి. థామస్, టి. శివప్రసాద్, పి.వి. కృష్ణారెడ్డి, సత్యానంద రెడ్డి, సుభాష్ చంద్రారెడ్డి, చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, ఎస్.వి. సుబ్బరాజా, పి. చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి హాజరైన సంవత్సరికం

**● మదనమోహన్ రెడ్డి తండ్రికి ఘన నివాళులు ● కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి**



**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 19:-**మండలంలోని యండపల్లి గ్రామం,పెద్దకాలవపల్లి వద్ద అర్చన విద్యాసంస్థల అధినేత మరియు టిడిపి నాయకుడు పాపిరెడ్డి మదనమోహన్ రెడ్డి తండ్రి సంవత్సరికం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మరణించిన వారి సమాధి వద్ద పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఎండిఎస్ విత్తనాలతో నేల సారవంతం ప్రకృతి వ్యవసాయానికి బలమైన పునాది



**మైలవరం మన జనప్రగతి ఏప్రిల్ 19:-** మండలం జాతీయ మిషన్ ప్రకృతి వ్యవసాయ గ్రామమైన తలమంచిపట్నం వీవో పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో రైతు వి. రమేష్ యాదవ్ తన ఓన్ ఫీల్డ్‌లో పిఎండిఎస్ (గ్రావీణా) విధానంలో వినూత్న సాగు చేపట్టారు.ఈ కార్యక్రమంలో 32 రకాల విత్తనాలను ఎంపిక చేసి సీడ్ పెల్లెటైజేషన్ చేసి వర్షాధార భూమిలో విత్తనం వేశారు. పిఎండిఎస్ విత్తనాల ప్రధాన ఉద్దేశ్యం నేలలో జీవ వైవిధ్యాన్ని పెంచడం, భూమి సారాన్ని సహజంగా పునరుద్ధరించడం. **పిఎండిఎస్ ద్వారా:** భూమిలో సూక్ష్మజీవులు పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది.పంటలకు అవసరమైన పోషకాలు సహజంగా లభిస్తాయినేల తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందికలుపు మొక్కల నియంత్రణకు సహకరిస్తుందిపర్యావరణానికి హాని లేకుండా స్థిరమైన వ్యవసాయానికి దారి చూపుతుందిఈ విధానం వల్ల రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయి మరియు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేల అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్, సబ్ డివిజనల్ యాంకర్ లక్ష్మీదేవి, ఐసిఆర్పిలు గోపాల్ రెడ్డి, నాగేశ్వరి, సంగీత పాల్గొన్నారు. సమీప రైతులు కూడా హాజరై పిఎండిఎస్ విధానం పట్ల ఆసక్తి కనబరిచారు.ఈ కార్యక్రమం ద్వారా పిఎండిఎస్ విత్తనాల ప్రాముఖ్యత రైతులకు తెలియజేసి, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు దోహదపడుతోంది.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

**● ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు..**

**జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరిక**



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 19:-** ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 213 కేసులు నమోదు చేసి, రూ.56,485 జరిమానా విధించడం జరిగిందని జిల్లా ఎస్.పీ తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లలో వెళ్లే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని జిల్లా ఎస్.పీ సూచించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రమాదకరమని , రాంగ్ రూట్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అక్షయ తృతీయ సందర్భంగా అన్నప్రసాదం,మజ్జిగ వితరణ


**● సానపరెడ్డి రాధాకృష్ణారెడ్డి సహకారం..**



**బద్వేల్ మన జనప్రగతి ఏప్రిల్ 19:-**అక్షయ తృతీయ సందర్భంగా మరియు మండుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బోవిల్లవారిపల్లె గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి సహకారంతో ఆదివారం మైదుకూరు రోడ్డులోని మంచినీటి చలివేంద్రం వద్ద అన్నప్రసాదం, స్వీట్ మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించారు. బాటసారులు, అనాథలు, అవసరమైన వారికి రుచికరమైన భోజనం అందించి సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమం కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించడం అభినందనీయమని మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి. సుబ్బారావు, జర్నలిస్ట్ వల్లం కొండు వెంకటరమణ, విద్యావేత్త సి.వి. నాగేశ్వరరావు, కొలిశెట్టి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్, పెసల సుధాకర్ తదితరులు పేర్కొన్నారు. సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి సేవా కార్యక్రమాలు బద్వేల్ ప్రాంతంలో విశేషంగా ప్రశంసలు పొందుతున్నాయని తెలిపారు.ఇటీవల జాంబవంత నగర్ కోదండరామాలయానికి పంచలోహ విగ్రహానికి సహాయం అందించడం, అలాగే బోవిల్లవారిపల్లె గ్రామంలో ఉచితంగా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం వంటి సేవలను కూడా వారు గుర్తు చేశారు. సామాజిక బాధ్యతతో చేపడుతున్న సేవలు మరింత విస్తరించాలని పలువురు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ అక్షయ తృతీయ రోజున చేసే దానం కోటి రెట్లు ఫలితాన్ని ఇస్తుందని, ముఖ్యంగా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం అత్యున్నతమైన పుణ్యకార్యమని పేర్కొన్నారు. పితృదేవతల ఆశీస్సులు, లక్ష్మీదేవి కటాక్షం కలుగుతాయని విశ్వాసం ఉందన్నారు.ఇతరుల ఆకలిని తీర్చడం ద్వారా లభించే సంతృప్తి మనసుకు ప్రశాంతతను ఇస్తుందని, ఇది గొప్ప సామాజిక సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగా వెంకటరమణ (ఆర్ఎంపీ డాక్టర్)తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి: జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్

**● గండి ఆలయంలో పూజలు ● ప్రజాసేవలో తిరిగి రావాలని ఆకాంక్ష.**



**వేంపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 19:-**జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అనారోగ్యానికి గురైనట్లు సమాచారం. శుక్రవారం అధికారులతో పాలనాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురైనట్లు తెలిసింది.వైద్యుల సూచన మేరకు శనివారం ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ విషయం తెలిసి తాను వ్యక్తిగతంగా ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు.గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాకుండా లక్షలాది మందికి ఆశాకిరణమని చెప్పారు.ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ప్రతి జనసేన కార్యకర్తలు, మహిళలు ప్రార్థనలు చేస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని మరింత దృఢ సంకల్పంతో ప్రజాసేవలో కొనసాగాలని దాసరి రవిశంకర్ ఆకాంక్షించారు.

## హెల్త్ హబ్‌గా హైదరాబాద్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 19:-** హైదరాబాద్ ను హెల్త్ హబ్ తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. బర్కత్ పుర లోని డాక్టర్ ఆనంద్ ఇంటర్నేషనల్ హేయిర్ ట్రాన్స్ ప్లాంట్, స్కిన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆధునాతనమైన స్కిన్, హేయిర్ లేజర్ మిషన్లను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వనున్న డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, మరో ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద సంగారెడ్డిని ఎంపిక చేయడం జరిగిందని, మంచి ఫలితాలు వస్తున్నాయని దానిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి పూర్తి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలో తెలంగాణను వైద్య రంగంలో ఆదర్శంగా తీసుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వైద్యానికి అత్యంత అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి. ఆనంద్ కుమార్, డాక్టర్ సమత, దీపక్, శిల్ప, హరికుమార్, లాస్య, ఉమా, సమిత, ఆర్.కె.జైన్, శేషనారాయణ, టి.ఆనంద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరు పట్టణంలో ఘనంగా శ్రీ రుద్రయాగం చండియాగం

**• ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝూన్సీ రాజేందర్ రెడ్డి**







**తొర్రూరు ప్రతినిధి, మన జనప్రగతి ఏప్రిల్ 19:** మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో లోక కళ్యాణార్థం నిర్వహించిన చతుస్పష్టి కుండాత్మిక శ్రీ రుద్రయాగం సహిత చండియాగం ఘనంగా నిర్వహించారు ఈ మహాయాగంలో 108 దంపతులు పాల్గొని విశేష భక్తిశ్రద్ధలతో యాగ కార్యక్రమాలను జరిపించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రాంతంలో భక్తి వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ యాగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝూన్సీ రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. యాగశాలలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగంలో పాల్గొన్న దంపతులను ఆశీర్వదిస్తూ వారి కుటుంబాలకు శాంతి, సౌఖ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతి, సత్సంకల్పాలు కలిగిస్తాయని, ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. లోకక్షేమం కోసం నిర్వహించే యాగాలు ఎంతో పవిత్రమైనవని, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చండియాగాన్ని నిర్వహించిన బ్రహ్మశ్రీ కాసోజు సాయినాథాచార్యులను ఝూన్సీ రాజేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఇంత పెద్ద స్థాయిలో యాగాన్ని విజయవంతంగా నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడుతూ, వారి సేవలు సమాజానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్ , వార్డు కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగాన్ని విజయవంతం చేశారు. యాగం సందర్భంగా నిర్వహించిన హోమాలు, పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి. మొత్తం కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణంలో జరిగింది.

# ములుగు జిల్లా వ్యాప్తంగా ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్స్ బంద్

**ములుగు జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్**

**ములుగు జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 19 మరియు 20 తేదీల్లో కొనసాగుతోంది.**






**ములుగు ప్రతినిధి మన జనప్రగతి ఏప్రిల్ 19:** ములుగు జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 19 మరియు 20 తేదీల్లో కొనసాగుతోంది. ఫ్లెక్సీ ప్రింటింగ్‌కు ఉపయోగించే కలర్స్ (ఇంక్) మరియు ఇతర ముడి పదార్థాల ధరలు ఒక్కసారిగా 50 శాతం పెరగడంతో యజమానులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. పెరిగిన మెటీరియల్ ధరలను తగ్గించాలని లేదా ప్రింటింగ్ చార్జీలను సవరించుకునేందుకు వీలుగా అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ములుగు జిల్లాలోని అన్ని ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులు ఏకమై, ఈ రెండు రోజుల పాటు కార్యకలాపాలను నిలిపివేసి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో శ్రీను ఫ్లెక్సీ ములుగు స్ స్ ప్రింటర్స్ ములుగు శ్రీనివాస ప్రింటర్స్ ములుగు మైన ఫ్లెక్స్ పస్రా దివ్య ఫ్లెక్సీ ఏటూరునాగారం వారు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు

**కాంగ్రెస్ నేతలకు ఘన సన్మానం**

**పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తాం**

**కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరము కృషి**

**సంక్షేమ పథకాలు ప్రజల దరి చేరేలా కృషి చేస్తాం**

**ప్రతిభ పూనిన జిల్లా కాంగ్రెస్ నాయకులు**



**కల్లూరు,మన జనప్రగతి ఏప్రిల్ 19:** కాంగ్రెస్ పార్టీ పట్ల అచంచల విశ్వాసంతో పనిచేసిన నాయకులకు గౌరవ స్థానం కల్పించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించడంతో ఆనందం వ్యక్తం చేస్తూ కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం పట్టణంలో శాలువాలతో ఘన సన్మానం నిర్వహించారు. మత్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శీలం బ్రహ్మ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక సభ్యురాలు ఇజ్జగాని శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కె సిరా ఉద్దీన్‌లను శాలువాలతో సత్కరించారు. కల్లూరు మండలానికి చెందిన నాయకులకు జిల్లా స్థాయిలో గౌరవ స్థానాలు దక్కడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శీలం బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి జిల్లా కమిటీలో స్థానం కల్పించి గౌరవించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం అని తెలిపారు. పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం అని తెలిపారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దరి చేరేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం చేస్తాం. ప్రజల విశ్వాసాన్ని మరింతగా పెంచే విధంగా పనిచేస్తాం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచడం మా లక్ష్యం అని పేర్కొన్నారు. జిల్లా నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి శ్రమిస్తామని ఇతర నాయకులు కూడా పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని మరింత బలపరిచే దిశగా కలిసి పనిచేస్తామని తెలిపారు. నాయకుల సన్మాన కార్యక్రమం ఉత్సాహపరిత వాతావరణంలో సాగగా నాయకుల సన్మానం ద్వారా పార్టీ పట్ల నిబద్ధత విశ్వాసము మరోసారి ప్రతిఫలించింది కాంగ్రెస్ పార్టీ సేవలను గుర్తించి గౌరవించడం నాయకులు కొత్త ఉత్సాహాన్ని నింపిందని, నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్బూరి కొండయ్య, యరమల నర్సిరెడ్డి, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ భూక్య రవీంద్రబాబు, యరకరెడ్డి బసివి రెడ్డి, వణుకూరి నర్సింహారెడ్డి, యలమ రెడ్డి వెంకట రామిరెడ్డి, శీలం నారాయణ రెడ్డి, బొడ్డు అప్పయ్య, ఎస్.కె నబీ, వేముల కృష్ణ, ఎస్.కె జానీ, ఎస్.కె భాజీ, అవులూరి శ్రీనివాస రెడ్డి, జక్కు కృష్ణయ్య, అంజమ్మ, శ్రీను పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర సేవా సమితి సేవలు భేష్

**• కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతంలో చలివేంద్రం ప్రారంభం**

**• ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మన జనప్రగతి ఏప్రిల్ 19:** ఉత్తరాంధ్ర సేవా సమితి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతంలో ఉత్తరాంధ్ర సేవా సమితి అధ్యక్షులు దండుగుల తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఉత్తరాంధ్ర సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే రోడ్లు నిర్మించడం జరిగిందని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని చిన్నతరహా పరిశ్రమలు యజమానులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న శాంతివనం స్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మైనారిటీ నాయకుడు ఎంకె. బద్రోద్దీన్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ఉత్తరాంధ్ర సేవా సమితి నాయకులు ఎ. చందు, బి. లక్ష్మణ్ రావు, కె. లక్ష్మి నారాయణ, టి. యర్రంనాయుడు, టి. ఉమాశంకర్, కె. రవిశంకర్, సి. అనిల్ కుమార్, బి. అప్పన్న, బి. శమం, పి. ధనుంజయ, రాంబాబు, బి. జగదీష్, రాము, బి. ఆనంద్ రెడ్డి, వెంకట రావు, శేషగిరి, కె. నీలకంఠం, శంకర నారాయణ, బి. ప్రసాద్, ఉమా మహేశ్వర రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబానికి తోడుగా నిలిచిన బంచరాయితండ హెల్పింగ్ హ్యాండ్స్

**వడదెబ్బతో మృతి చెందిన సతీష్ కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సాయం.**



**మహబూబాబాద్ జిల్లా మన జనప్రగతి ఏప్రిల్ 19:** కురవి మండలం బంచరాయితండలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ సతీష్ (తండ్రి బిక్కు) వడదెబ్బకు గురై మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ కష్టసమయంలో గ్రామంలోని "హెల్పింగ్ హ్యాండ్స్" సేవా బృందం ముందుకు వచ్చి మానవతా విలువలను చాటుకుంది. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సతీష్ కుటుంబానికి రూ. 20,000లను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ఏప్రిల్ 11 రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సతీష్, ఆ రోజు కూడా సాధారణంగానే పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అయితే రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని వివరించారు. సతీష్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పూర్తిగా అతని ఆదాయంపై ఆధారపడి ఉండటంతో, అతని మరణం వారి జీవనాధారాన్ని కుదిపేసింది. ఈ నేపథ్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు స్పందించి వెంటనే సహాయం అందించడం గ్రామ ప్రజల ప్రశంసలను అందుకుంది. గత 7 సంవత్సరాలుగా ఈ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించడం, పేద కుటుంబాల్లో మరణాలు సంభవించినప్పుడు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. "ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఎవరికైనా కష్టం వస్తే ముందుండి సహాయం అందిస్తాం" అని గ్రూప్ సభ్యులు స్పష్టం చేశారు. బంచరాయితండలోని నిరుపేద కుటుంబాలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగడం సమాజంలో సహానుభూతి, పరస్పర సహకార భావనలను మరింత బలపరుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# బోడుప్పల్ లిటిల్స్ స్కాలర్స్ స్కూల్‌కు గ్లోబల్ లీడర్షిప్ అవార్డు

**• ఉత్తమ విద్య ప్రమాణాలు, ఆధునిక విద్యా విధానాలు ప్రామాణికంగా అవార్డు • ప్రముఖ నటి, ఎంపీ జయప్రద చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్కూల్ యాజమాన్యం**







**బోడుప్పల్, మన జనప్రగతి ఏప్రిల్ 19:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ కు గ్లోబల్ లీడర్షిప్ అవార్డు దక్కింది. ఈ అవార్డును ప్రముఖ నటి, ఎంపీ జయప్రద చేతుల మీదుగా స్కూల్ డైరెక్టర్ పూర్ణచ్చందర్ రావు, ప్రిన్సిపల్ ఓంకారేశ్వరి స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఓంకారేశ్వరి మాట్లాడుతూ అత్యుత్తమ విద్యా విధానాలను అవలంబిస్తూ మెరుగైన విద్య అందించడంలో లిటిల్ స్కాలర్ స్కూల్ ముందుంటుందని, ఆధునిక టెక్నాలజీ సహాయంతో విద్యార్థులకు అర్థవంతమైన విద్యా బోధన, స్కూలు యొక్క క్వాలిటీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఉపాధ్యాయుల అంకితభావం, కృషి పరిగణలో తీసుకొని గ్లోబల్ లీడర్షిప్ అవార్డు అందించడం జరిగిందని, అవార్డు రావడంలో సహకరిం చిన విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలుపుతు న్నామని, ఎవడు స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మెరుగైన ఉద్యమం అందించేందుకు కృషి చేస్తామని ఆమె అన్నారు.

# మానవత్వం చాటుకున్న కురవి పోలీస్

**కష్టసమయంలో వలస కూలి కుటుంబానికి 5000 ఆర్థిక సహాయం**



**కురవి మన జనప్రగతి ఏప్రిల్ 19:** మండలం బలపాల గ్రామంలో జరిగిన విషాద ఘటనలో కురవి పోలీసుల మానవత్వం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా నివాసి హిడ్మా సోరి (46) జీవనోపాధి కోసం వలస కూలిగా మామిడికాయలు కోయుటకు బలపాల గ్రామానికి వచ్చి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు రాత్రి తేనే తాగే అలవాటు ఉన్న హిడ్మా సోరి, ప్రమాదవశాత్తు తేనే అనుకుని పక్కన ఉన్న డబ్బాలోని పురుగుమందును తాగాడు. కొద్ది సేపటికి కడుపు నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తాను తాగిన పదార్థాన్ని పరిశీలించగా పురుగుమందు తాగినట్లు గ్రహించి, వెంటనే తనతో కలిసి పని చేస్తున్న బంధువులకు విషయం తెలియజేశాడు. వారు మృతుడిని వెంటనే మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో తెల్లవారుజామున సుమారు 1.30 గంటల సమయంలో హిడ్మా సోరి మృతి చెందాడు. మృతుని అల్లుడు ముడమి దేవా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వలస కూలిగా వచ్చి దురదృష్టవశాత్తు మరణించిన మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, మృతదేహాన్ని స్వగ్రామమైన దంతేవాడ జిల్లా తరలించేందుకు కురవి పోలీసులు రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కురవి రెండో ఎస్ఐ జయకుమార్, పోలీస్ సిబ్బంది హరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

# దక్షిణ కాశీ పుష్పగిరి - శిల్పసంపదకు నిలయం,పంచనదీ సంగమ మహాక్షేత్రం

**శివ - కేశవ సమానత్వాన్ని ప్రతిపాదించే అరుదైన ఆధ్యాత్మిక క్షేత్రం**

**పినాకిని తీరంలో ఐదు నదుల సంగమంతో పుణ్యప్రదమైన తీర్థస్థలం**

**చోళ,విజయనగర కాలాల అద్భుత శిల్పకళకు చిరస్మరణీయ నిదర్శనం**

**శిథిలావస్థలోకి చేరుతున్న ప్రాచీన ఆలయాల సంరక్షణపై ఆవశ్యకత**









**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 19:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్సార్ కడప జిల్లాలో వెలసిన పుష్పగిరి క్షేత్రం ఆధ్యాత్మిక, చారిత్రక, శిల్పకళా వైభవాల సమ్మేళనంగా నిలుస్తోంది. కడప పట్టణానికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో చెన్నూరువల్లూరు మండలాల పరిసరాల్లో ఉన్న ఈ క్షేత్రం "దక్షిణ కాశీ"గా ప్రసిద్ధి చెందింది. శైవ, వైష్ణవ సంప్రదాయాలు కలిసిన ఈ క్షేత్రం శివకేశవుల ఏకత్వానికి ప్రత్యక్ష సాక్ష్యంగా భావించబడుతోంది.పుష్పగిరి ప్రత్యేకతలో ప్రధానమైనది పంచనదీ సంగమం. పినాకిని (పెన్నా), పాపాగ్ని, కుందూ, వక్కిలేరు, మాండవి అనే ఐదు నదులు ఇక్కడ కలుస్తాయి. ఈ పవిత్ర సంగమంలో స్నానం చేస్తే పాప విమోచనం కలిగి మోక్షప్రాప్తి లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. వైశాఖ, కార్తీక, మార్గశిర మాసాలలో ఎకాదశి, పౌర్ణమి రోజుల్లో ఇక్కడ స్నానం చేయడం అత్యంత పుణ్యప్రదంగా భావించబడుతోంది.పుష్పగిరి పేరుకు సంబంధించిన పౌరాణిక గాథలు ఆసక్తికరంగా ఉన్నాయి. గరుడుడు తీసుకువచ్చిన అమృత కలశం నుంచి పడిన చుక్కలు ఈ ప్రాంతంలోని జలాన్ని పవిత్రం చేశాయని, ఆ నీటిని సేవించిన వారు యవ్వనాన్ని పొందారని చెబుతారు. ఈ విషయం తెలుసుకున్న దేవతలు హనుమంతుడిని పంపగా, అతడు కొండలను తెచ్చి ఆ ప్రవాహాన్ని నియంత్రించాడని, ఆ కొండ పుష్పంలా మారడంతో "పుష్పగిరి"గా ప్రసిద్ధి చెందిందని పురాణాలు పేర్కొంటాయి. మరో కథనం ప్రకారం, శ్రీరాముడు ఇక్కడ వైద్యనాథ స్వామిని పూజించి పుష్పాలను నదిలో వదలగా అవి గిరిలా పేరుకుపోయి ఈ ప్రాంతానికి పుష్పగిరి అనే పేరు వచ్చిందని చెబుతారు.ఈ క్షేత్రం చారిత్రకంగా కూడా విశేష ప్రాధాన్యం కలిగింది. మూడవ శతాబ్దం నుంచే ఇక్కడ ఆలయాల ప్రస్తావన ఉన్నట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. ఇక్ష్వాకుల కాలంలోనే బోధిశ్రీ అనే ఉపాసిక ఇక్కడ సత్రం నిర్మించినట్లు నాగార్జునకొండ శాసనాలు పేర్కొంటున్నాయి. చోళులు, పల్లవులు, రాష్ట్రకూటులు, విజయనగర రాజుల కాలంలో ఈ క్షేత్రం అత్యంత వైభవంగా అభివృద్ధి చెందింది.పుష్పగిరిలోని ఆలయ సముదాయాలు శిల్పకళలో అపూర్వమైనవి. పెన్నా నది ఎడమవైపు కొండపై ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణ. ఈ ఆలయం గాలిగోపురం,రామాయణమహాభారత శిల్పాలు, దశావతార రూపాలు దర్శనార్థులను అబ్బురపరుస్తాయి. ఆలయ నిర్మాణ శైలి ప్రాచీన భారతీయ శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తుంది.అదే ప్రాంతంలో లక్ష్మీదేవి ఆలయం, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర, ఆంజనేయ, రుద్రపాద ఆలయాలు ఉన్నాయి. రుద్రపాద ఆలయంలో శివుని పాదం ఉండడం ప్రత్యేకతగా భావించబడుతుంది. అలాగే విష్ణు పాదం, బ్రహ్మ పాదం ఉన్నాయని స్థానిక విశ్వాసాలు ఉన్నాయి.పెన్నా నది కుడి వైపున గ్రామంలో ఉన్న వైద్యనాథ స్వామి ఆలయం చారిత్రకంగా ముఖ్యమైనది. ఈ ఆలయంలోని రాతి స్తంభాలు,సాలు మండపం, శిల్పాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఆలయంలోని ఒక రాతిబండపై చెక్కబడిన చిన్న గుంతలు పురాతన వైద్య విధానాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.కామాక్షి దేవి ఆలయంలో ఉన్న శ్రీచక్రం ఆధ్యాత్మికంగా అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతోంది. శ్రీవిద్యారణ్య స్వామి ప్రతిష్ఠించిన ఈ శ్రీచక్రం దర్శనం భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని విశ్వాసం.భీమ లింగేశ్వర ఆలయం, త్రికూటేశ్వర ఆలయం, కమలేశ్వర ఆలయాలు విజయనగర కాలపు నిర్మాణ శైలిని ప్రతిబింబిస్తాయి.త్రికూటేశ్వర ఆలయం మూడు దేవాలయాల సమూహంగా ఉండటం విశేషం. ఈ ఆలయాలలోని స్తంభాలు, కుడ్య శిల్పాలు, నర్తన భంగిమలు శిల్పకళలో అత్యున్నత ప్రతిభను తెలియజేస్తాయి.పుష్పగిరిలోని శివాలపల్లెలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం కూడా విశేష ప్రాధాన్యం కలిగింది. ఈ ఆలయంలోని గాలిగోపురాలు, విదేశీ వస్త్రధారణ శిల్పాలు, మార్కండేయ గాథలను తెలియజేసే చిత్రాలు అరుదైనవిగా నిలుస్తాయి.ఒకప్పుడు పుష్పగిరిలో 108 శివాలయాలు ఉండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సుమారు 40 ఆలయాలు మాత్రమే మిగిలి ఉండగా, అనేక ఆలయాలు శిథిలావస్థకు చేరాయి. దుర్వినియోగం, నిర్లక్ష్యం కారణంగా విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాచీన వారసత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శ్రీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వాములకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. రథోత్సవం, కళ్యాణోత్సవం, వాహన సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. కార్తీక మాసం, మహాశివరాత్రి సందర్భాల్లో భారీగా భక్తులు తరలివస్తారు.పుష్పగిరి ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతోంది. సమీపంలోని ఆదిమాయపల్లె డ్యామ్ సందర్శకులకు ఆకర్షణీయంగా మారింది. చెన్నకేశవ స్వామి కొండపైకి వంతెన, డ్యామ్ వద్ద బోటింగ్ సదుపాయాలు కల్పించాలని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల నుంచి కడపకు విమాన, రైలు మార్గాల ద్వారా చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పుష్పగిరి క్షేత్రాన్ని సులభంగా చేరుకోవచ్చు.ఆధ్యాత్మికత, చరిత్ర, శిల్పకళఆల్ ఇన్ వన్ గా నిలిచిన పుష్పగిరి క్షేత్రం భక్తులకే కాదు, పర్యాటకులకు కూడా ఒక అద్భుత అనుభూతిని అందిస్తోంది.

**– నాణ్యపల్లి గోపాలకృష్ణ సీనియర్ జర్నలిస్ట్..(మన జనప్రగతి)చెన్నూర్, వైఎస్సార్ కడప జిల్లా**

# ఖమ్మం గుమ్మంలో గ్యాస్ట్రో అధునాతన వైద్య సేవలు









**సేవా దృక్పథంతో సరసమైన ధరలలో ఖమ్మం కేజీహెచ్ ఆసుపత్రి సేవలు ప్రారంభం**

**కేజీహెచ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ), మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ముదిరెడ్డి అనిమేష్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ విష్ణు ప్రియ**

**ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ ను ప్రారంభించిన కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగంధర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు**

**ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి ఏప్రిల్ 19:** పే బ్యాక్ టూ సొసైటీ అనే సేవా దృక్పథంతో, గ్యాస్ట్రిక్ సమస్యలపై ప్రజల్లో సంపూర్ణ చైతన్యం, అవగాహన కల్పించాలని, వ్యాధి బారిన పడిన వారికి సరసమైన ధరలలో వైద్య సేవలు అందించేందుకు ఖమ్మం గుమ్మంలో గ్యాస్ట్రో అధునాతన వైద్య సేవలను ప్రారంభించామని కేజీహెచ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ), మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ముదిరెడ్డి అనిమేష్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ విష్ణు ప్రియ లు అన్నారు. జీవనశైలి మార్పుల వల్ల వస్తున్న అనేక రకాల గ్యాస్ట్రిక్ సమస్యలపై ప్రజల్లో సంపూర్ణ చైతన్యం, అవగాహన కల్పించడంతో పాటు అధునాతన వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని, దాన్లో భాగంగా ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్లో ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఖమ్మం నగరంలో 'ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్' ను ఆదివారం ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజతో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయ కార్యదర్శి తుంబూరు దయాకర్ రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు లు కలసి ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాజిక బాధ్యతగా తమ వంతు ఆధునిక వైద్యశాలను ఖమ్మం నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఖమ్మం నగరంలో హైదరాబాద్ స్థాయి వైద్య సేవలు ఏర్పాటుకు ముందుకు వచ్చిన కేజీహెచ్ వైద్య బృందాన్ని అభినందించారు. సమాజంలో అనేకమంది గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతూ సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో కేజీహెచ్ ఆసుపత్రి ప్రారంభించడం అభినందనీయమన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల అవసరం ఖమ్మం నగరానికి మరింతగా ఉందని, కేజీహెచ్ ప్రారంభంతో ఈలోటు భర్తీ అయ్యిందన్నారు. ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ కు సమీపంలో గత 50 ఏళ్లుగా అనేకమంది వైద్యులు సేవలందించిన భవనంలో నూతనంగా కేజీహెచ్ ఆసుపత్రిని ప్రారంభించడం వల్ల ప్రజలకు అతి సమీపంలోకి గ్యాస్ట్రిక్ వైద్యం వచ్చినట్లు అయిందన్నారు. ఖమ్మం నగరంలో హైదరాబాద్ స్థాయి అధునాతన వైద్య సౌకర్యాలు కల్పించడం చాలా సాహసోపేతం అన్నారు. కేజీహెచ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (జీవీ), మెడికల్ గ్యాస్ట్రోఎంట రాలజిస్ట్ డాక్టర్ ముదిరెడ్డి అనిమేష్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ విష్ణు ప్రియ, డైరెక్టర్ అడ్మిన్ అరుణ గోగిరెడ్డి, డైరెక్టర్ మార్కెటింగ్ స్వాతిరెడ్డి పరుపాటి లను వైద్య ప్రముఖులు యూరాలజిస్ట్ డాక్టర్ గుర్నాధరావు, ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ కంభంపాటి నారాయణరావు, ప్రముఖ ఆర్థో సర్జన్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బొల్లికొండ శ్రీదేవి, పలమనాలజిస్ట్ డాక్టర్ గోపగాని సురేందర్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ పెద్దిరెడ్డి సుదీంధర్ రెడ్డి, పీడియాట్రిషన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గంగరాజు, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ప్రముఖ శాస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎస్ పాపారావులతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి, నగరంలోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీ శ్రీరామ్ హిల్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు మందడపు సుజాత రెడ్డి, కార్యదర్శి నున్న రాధాకృష్ణ, జాయింట్ సెక్రెటరీ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సంతోష్, ఈసీ సభ్యులు కోట వెంకటరెడ్డి, స్నేహ డయాగ్నస్టిక్స్ అధినేత నర్సిరెడ్డి, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కొండపల్లి శేష ప్రసాద్, ప్రముఖ ఉపాధ్యాయ సంఘం నాయకులు గుడిద శ్రీనివాసరావు, నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థ తెలంగాణ ఏజెన్సీస్ మేనేజింగ్ పార్ట్నర్ మోటమర్రి లక్ష్మీనారాయణ, పలు రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ నగర కార్పొరేషన్ అధ్యక్షులు దీపక్ చౌదరి, కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నగర నాయకులు గౌని హనుమంతరావులతో పాటు సేవా భారతి నుంచి నారాయణరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర నాయకులు గెల్లా సత్యనారాయణ, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నుంచి అశోక్, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆకుతోట ఆదినారాయణ, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి లు అభినందించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174